
సాక్షి ఒడిశా

గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.6,35,290

బంగారం 4 గ్రాముల 720 మిల్లీ గ్రాములు

వెండి 21 గ్రాముల 650 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



అసెంబ్లీలో రసాభాస

అధికార, విపక్షాల వాగ్వాదంతో రాష్ట్ర శాసనసభ బుధవారం రసాభాసగా మారింది.

- 8లో



కదం తొక్కిన ఉపాధ్యాయులు

రాష్ట్రవ్యాప్తంగా మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయులు దీర్ఘకాల డిమాండ్ల సాధనకు ఉద్యమం ఉధృతపరిచారు.

- 8లో

న్యూస్‌రీల్

త్రుటిలో తప్పిన ప్రమాదం



మలుపు వద్ద ఆగిన బస్సు

రాయగడ: సదరు సమితి బాయిసింగి నుంచి ప్రయాణికులతో వస్తున్న లక్ష్మీ బస్సుకు త్రుటి లో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు సుమారు 30 మందికి పైగా ప్రయాణికులతో రాయగడకు వస్తూ, బాయిసింగి గ్రామానికి సమీపంలోని వ్యూ పాయింట్ వద్ద మలుపు తిప్పుతుండగా బస్సు అదుపుత ప్పి పక్కనే ఉన్నటువంటి లోయలో పడబోయింది. అయితే డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్య వహరించి బస్సుకు బ్రేకువేసి నెమ్మదిగా నిలపడంతో ప్రయాణికులు ప్రమాదం నుంచి త ప్పించుకోగలిగారు. బస్సు నిలిపిన అనంతరం ప్రయాణికులను బయటకు దింపి, వెనుకకు మళ్లించిన అనంతరం తిరిగి ప్రయాణికులను ఎక్కించుకుని గమ్యానికి చేరుకున్నాడు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

‘తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం’



మావో కార్యదర్శి గణేష్ పేరుతో విడుదలైన లేఖ

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో మావోయిస్టుల పేరుతో వెలిసిన పోస్టర్లు తాము వేయలేదని మావోయిస్టు పార్టీ ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటనలో తమపై తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. పార్టీని వదిలి ఎవరూ వెళ్లలేదని స్పష్టం చేశారు. అందరూ ఏవోబీలోనే తమ బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. పోలీసులే మావోల ఆచూకీ కోసం తప్పుడు పోస్టర్లు అతికిస్తున్నారని మండిపడ్డారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న కేశవ శెఠి

రాయగడ: ఆధ్యాత్మికతతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని దివ్యదర్శన్ సంఘం కార్యదర్శి కేశవ శెఠి అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని దివ్యదర్శన్ మందిరం సమావేశ హాల్‌లో బుధవారం సంఘం 21వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సద్గురు అర్జున్ ఆశయాలు నెరవేరాలన్నా, మానసిక ప్రశాంతత కలగాలన్నా ప్రతిరోజూ సత్సంగం, సన్మార్గంలో నడుచుకోవాలని హితవు పలికారు. ఈ జిల్లాలో జన్మించిన సద్గురు అర్జున్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం మన అదృష్టమన్నారు. అలాగే ఆరోగ్యంగా ఉండాలంటే నిత్య సాధనతో పాటు యోగా చేయడం మంచిదని సూచించారు. అనంతరం సత్సంగ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న మాథ్యు నాయక్

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని బరంపురం విన్సెన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మాథ్యు నాయక్ అన్నారు. స్థానిక సెక్రెడ్ హార్ట్ స్కూల్ 55వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలలో చెప్పే పాఠాలను శ్రద్ధగా వినడంతో పాటు సంగీతం, చిత్రలేఖనం, క్రీడలు, నృత్యం వంటి వాటిపై కూడా ఆసక్తి కనబరచాలన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఓఏఓ సంస్థ సీఈవో రితేష్ అగ్రవాల్ ఈ పాఠశాలలోనే చదువుకున్నారని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ అనంత నాయక్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో సైతం రాణిస్తుండడం గర్వకారణమన్నారు. వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రదర్శించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

చెరుకు రైతుకు తీపి కబురు

- తెరుచుకున్న అస్కా సుగర్ ఫ్యాక్టరీ
- కొనుగోళ్లు ప్రారంభించినట్లు ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



వివరాలు వెల్లడిస్తున్న కర్మాగారం ఎండీ రబీంద్ర పండా



తెరుచుకున్న అస్కా సుగర్ ఫ్యాక్టరీ

బరంపురం: అసియా ఖండంలోనే మొట్టమొదటి సుగర్ ఫ్యాక్టరీ 1824లో గంజాం జిల్లా అస్కా పట్టణంలో స్థాపించారు. అప్పటి నుంచి ఈ ఫ్యాక్టరీ వలన వేలాది మంది రైతులకు మేలు జరిగింది. జిల్లా చుట్టుపక్కల సుమారు 16 బ్లాకులకు చెందిన వేలాది కుటుంబాలు ఈ ఫ్యాక్టరీపై ఆధారపడి జీవనోపాధి పొందాయి. అయితే కరోనా మహమ్మారి కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలు చేయడంతో ఫ్యాక్టరీ మూతబడింది. అప్పటి నుంచి తెరుచుకోకపోవడంతో ఫ్యాక్టరీపై ఆధారపడిన అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి.



ఫ్యాక్టరీకి చేరుతున్న చెరుకు పంట

ఎట్టకేలకు...

కరోనా సమయం నుంచి మూతబడిన ఫ్యాక్టరీ ఎట్టకేలకు రెండు రోజుల క్రితం మరలా తెరుచుకుంది. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఎండీ రబీంద్ర పండా మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది 8,500 హెక్టార్లలో పండించిన చెరుకు పంటను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించారు. ఒక టన్నుకు రూ.3,080లు చెల్లించడంతో పాటు 100కి.మీ దూరం నుంచి తీసుకొచ్చిన పంటకు అదనంగా రూ.80లు చెల్లించడం జరుగుతుందని యాజమాన్యం తెలియజేసింది. దీంతో రైతులు ఆనందంతో చెరుకు పంట కోతను ప్రారంభించారు. అస్కా, హింజిలికాట్, సరగడా, సురడా, సన్నోఖెముండి, కొదలా, కళ్లికోట్, దిగపండి, కవిసూర్యానగర్, బెల్లిగుంటా, బంజనగర్, జగన్నాథ్ ప్రసాద్, ఛత్రపూర్, చికిటి, రొంగాయిలొండా, ధరాకొట్ బ్లాకుల్లో చెరకు పంటపై ఆధారపడిన 5 వేల కుటుంబాల రైతులు, తాము 10 వేల హెక్టర్లలో పండించిన పంట కోతను మొదలుపెట్టి బిజీబిజీగా గడుపుతున్నారని గంజాం చెరుకు సాగు రైతుల సంఘం అధ్యక్షుడు సింహాచలం పాత్రో తెలియజేశారు.



హింజిలికాట్ బ్లాక్ నుంచి లారీల్లో తీసుకొచ్చిన పంట



కర్మాగారంలో చక్కెర తయారవుతున్న దృశ్యం



చెరుకు పంట కోతలో బిజీబిజీగా రైతులు

జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణ స్వీకారం



జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్



చీఫ్ జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్‌ని అభినందిస్తున్న గవర్నర్

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాష్ట్ర హైకోర్టు 34వ ప్రధాన న్యాయమూర్తి. గవర్నర్ రఘుబర్ దాస్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొత్త ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. 1963 జనవరి 20న జన్మించిన జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ఎల్‌ఎల్‌బీ పట్టా పొందిన తర్వాత, 1990 అక్టోబర్ 30 నుంచి న్యాయవాదిగా వృత్తిలో అడుగు పెట్టారు. 1998లో కేంద్ర ప్రభుత్వంచే అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన ఆయన, 2001 వరకు ఈ హోదాలో పని చేశారు. ప్రధానంగా సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, కారిత్మక చట్టం కింద క్రిమినల్ కేసులను నిర్వహించారు. పాట్నా హైకోర్టులో అకౌంటెంట్ జనరల్ కార్యాలయం తరపున కేసులను నిర్వహించడానికి కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ ద్వారా ప్యానెల్ కౌన్సెల్‌గా వ్యవహరించారు. 2010 సెప్టెంబర్ 8 నుంచి సీనియర్ అడ్వకేట్ హోదా పొందారు. 2010 డిసెంబర్‌లో బీహార్ ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. 2012 ఏప్రిల్ 4న పాట్నా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందేవరకు అదనపు అడ్వకేట్ జనరల్‌గా కొనసాగారు. గతేడాది ఫిబ్రవరి 6న పాట్నా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. అక్టోబర్ 3న ప్రధాన న్యాయమూర్తి శుభాసిస్ తలపాత్ర పదవీ విరమణ చేసినప్పటి నుంచి ఒరిస్సా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తితో కార్యకలాపాలు నిర్వహించింది. జస్టిస్ బి.ఆర్.షడంగి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఇప్పటివరకు విధులు నిర్వహిస్తున్నారు.

145 కిలోల గంజాయి పట్టివేత



అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు



నిందితుడిని అరెస్టు చేసిన ఫిరింగియా పోలీసులు

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల్లో గంజాయి మాఫియా చెలరేగుతోంది. ప్రతిరోజూ అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ కోట్లలో ఆర్జిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు నగర శివారు ఫుకిడి బొందా 16వ నంబర్ జాతియ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక కారులో 70 కిలోల గంజాయి సీజ్ చేశారు. అలాగే కారు సీజ్ చేయడంతో పాటు ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర కుమార్‌గా ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు తెలియజేశారు. అదేవిధంగా కొందమాల్–గంజాం జిల్లా సరిహద్దు కళింగా ఘాటిపై ఫిరింగియా పోలీసులు ఆటోలో మరో 75 కిలోల గంజాయి సీజ్ చేశారు. ఎస్పీ సురేంద్ర కుమార్ పాత్రో తెలిపిన సమాచారం మేరకు.. కొందమాల్ జిల్లా ఫిరింగియా పోలీసులు కళింగా ఘాటిపై ఆటోలో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా 75 కిలోల గంజాయి సీజ్ చేశారు. దీంతో ఆటోను సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేశారు.

గొడ్డలితో నరికి భార్యను హత్య చేసిన భర్త



పుష్ప మృతదేహం



గాయాలు పాలైన శివశంకర్ రౌత్

రాయగడ: పొరుగు జిల్లా కలహండి సరిహద్దు కాసీపూర్ సమితి మునిషిగా పంచాయతీలోని బటిపాస్ గ్రామంలో భార్యను గొడ్డలితో ఒక వ్యక్తి హత్య చేశాడు. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. బటిపాస్ గ్రామానికి చెందిన గురునాథ్ గౌడో(56) అనే వ్యక్తి తన భార్య పుష్ప(45)తో గొడవ పడ్డాడు. దీంతో కోపంతో ఇంటిలో ఉన్న గొడ్డలితో భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఇరుగుపొరుగు వారు విషయం తెలుసుకుని రక్తపు మడుగులో ఉన్నటువంటి పుష్పను ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గొడ్డలితో దాడి చేసిన అనంతరం గౌడో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదేరోజు కలహండి జిల్లాలోని తువామూల్‌రాంపూర్ పోలీసుస్టేషన్ పరిధి పెంగుకుసి గ్రామానికి చెందిన శివశంకర్ రౌత్ (12), కలాపాణి గ్రామానికి చెందిన మధు మాఝి (12) అనే ఇద్దరి యువకులపై సైతం గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. కాసీపూర్ పోలీసులు గురునాథ్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అతనికి మతిస్థిమితం లేకపోవడమే దాడి చేయడానికి కారణమని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: గుసాని సమితి శోబర పంచాయతీ గారబంద, లావణ్యగడ గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై బుధవారం ప్రచారం నిర్వహించారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుసాని మాజీ వైస్ చైర్మన్ పి.ఢిల్లీశ్వరరావు, జగన్నాథ పండా, కృషక్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ పాలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్ల పండగ



అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



బల్లకు పూజలు చేసిన రజకులు

పర్లాకిమిడి: మకర సంక్రాంతి అనంతరం రజకులు తమ వృత్తికి కొన్ని రోజులు విరామం పాటిస్తారు. అనంతరం మాఘమాసంలో బల్ల పండగ ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా పర్లాకిమిడి 14వ వార్డు చాకలివీధిలో అత్యంత ఆడంబరంగా రజకులు బల్ల పండుగ వేడుకలు జరుపుకున్నారు. అలాగే చెవిటమ్మ వీధిలో రజకులు ముగ్గులు, అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి రాయిచెట్టు వద్ద కుల దేవత చెవిటమ్మ కోవెల వద్ద బల్లకు పూజ చేశారు. పండగ పూర్తయిన అనంతరం మరలా వృత్తిని కొనసాగిస్తారు.

‘ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి’



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థిని తండ్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల వద్ద విద్యార్థులంతా కలిసి ఉపాధ్యాయుడిపై బుధవారం దాడిచేశారు. వివరాల్లోకి వెళ్తే.. డిసెంబర్‌లో డెహ్రాడూన్‌లో క్రీడా పోటీలు జరిగాల్సి ఉండేవి. దీంతో జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులను ముందుగా భువనేశ్వర్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉపాధ్యాయుడు విభూతి ప్రసాద్ పండా తీసుకొని వెళ్లాడు. భువనేశ్వర్‌లో గెలిచిన ఐదుగురు విద్యార్థినులను డెహ్రాడూన్ తీసుకొని వెళ్లాల్సి ఉండేది. అయితే అక్కడ జరగాల్సిన క్రీడలు వాయిదా పడడంతో భువనేశ్వర్‌లో ఆగిపోయారు. అయితే తాము ఎప్పుడూ ట్రైన్‌లో వెళ్లకపోవడంతో కొరాపుట్ వరకు ట్రైన్‌లో తీసుకొని వెళ్లాలని విద్యార్థినులు ఉపాధ్యాయుడిని కోరారు. దీంతో హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో కొరాపుట్ బయల్దేరారు. దీనిలో భాగంగా సదరు ఉపాధ్యాయుడు ఒక విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఎవరికైనా విషయం చెబితే తాను తీసిన వీడియో వైరల్ చేస్తానని భయపెట్టాడు. దీంతో అప్పటినుంచి విద్యార్థిని ఎవరితోనూ మాట్లాడడం లేదు. చివరికి బుధవారం తన స్నేహితులతో ఈ విషయం చెప్పింది. వారు విద్యార్థిని తండ్రికి విషయం చెప్పడంతో కోపంతో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయుడిపై దాడి చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని విద్యార్థిని తండ్రి హెచ్చరించారు. గతంలోనూ ఉపాధ్యాయుడు ఇదేవిధంగా ప్రవర్తించడంతో పాఠశాల యాజమాన్యం హెచ్చరించారు. కానీ అతడిలో ఎటువంటి మార్పు రాలేదని సిబ్బంది పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో బాలల హక్కుల కమిషన్ పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం తదితరులు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళగిరి నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్‌ను కలిసి బాలల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు. 11 గంటలకు అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు పట్టణంలోని కేజీబీవీ, 3గంటలకు రిమ్స్ ఆసుపత్రిని సందర్శించనున్నారు. అనంతరం రోడ్డు మార్గాన మంగళగిరి చేరుకోనున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఒడిశా రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సారవకోట: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వక్తలు పేర్కొన్నారు. సారవకోట మండలం కిడిమి గ్రామ సమీపంలో పద్మాపురం గ్రామానికి చెందిన రావాడ మోహనరావు సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఒడిశా రాష్ట్రం కెందూఝర్ చెందిన 41 మంది రైతులు బుధవారం సందర్శించారు.జిల్లా సేంద్రియ సాగు సిబ్బంది ఆధ్వర్యంలో మెలకువలు తెలుసుకున్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు మొక్కల సాగు విధానాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ గోవింద రెడ్డి, ఎంటీ రమణ, వైభవ లక్ష్మి, జ్యోతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి



రిలే నిరాహార దీక్షల్లో న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే ఏపీ రాష్ట్ర భూహక్కు చట్టం – 22ను తీసుకురావడం అన్యాయమని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తక్షణమే రద్దు చేయాలని శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర భూహక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం అమల్లోకి వస్తే సామాన్యులు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రిలే నిరాహార దీక్షలో సూర్యారావుతో పాటు ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, న్యాయవాదులు ఎం.భవానీప్రసాద్, కట్ట పార్థసారథి, కొండాల సూర్యనారాయణ, పి.వి.రవి కూర్చున్నారు. వీరికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు సంఘీభావం తెలిపారు.

తల్లి మందలించడంతో బాలుడు అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : ట్యూషన్ ఫీజు కట్టకుండా డబ్బులు ఏం చేశావని తల్లి మందలించడంతో బలగ బందారి వీధికి చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. సాధు శివనారాయణ, రాధ దంపతుల కుమారుడు పృథ్వీరాజ్ నగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో పదో తరగతి చదివిస్తున్నాడు. ఈ నెల 6న ట్యూషన్ ఫీజు రూ.1000 కట్టాలని చెప్పగా తల్లి రూ.500 ఇచ్చింది. సాయంత్రం పృథ్వీరాజ్ ఇంటికొచ్చాక ఫీజు కట్టలేదని తెలుసుకున్న తల్లి మందలించింది. దీంతో అదే రోజు రాత్రి పదిగంటలకు ఎవరికీ చెప్పకుండా పృథ్వీరాజ్ బయటకు వెళ్లిపోయాడు. అన్నిచోట్లా వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

అసెంబ్లీలో రసాభాస

- అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం
- స్పీకర్ మైక్ విరగొట్టిన బీజేపీ సభ్యులు
- శ్రీజగన్నాథుని పొంగలి కల్తీ చేస్తున్నారని ఆరోపణ



అసెంబ్లీ బయట ప్లకార్డులతో బీజేపీ ఎమ్మెల్యేల నిరసన ప్రదర్శన



స్పీకర్ పోడియం చుట్టుముట్టిన విపక్ష సభ్యులు

భువనేశ్వర్: అధికార, విపక్షాల వాగ్వాదంతో రాష్ట్ర శాసనససభ రసాభాసగా మారింది. ఓట్ ఆన్ అకౌంట్ మూడో రోజు సమావేశాలు బుధవారం యధాతధంగా ప్రారంభమయ్యాయి. అయితే సభ ప్రారంభమైనప్పటి నుంచే విపక్షాలు విమర్శలకు దిగాయి. పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకారం లోకార్పణ మహోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఇళ్ల నుంచి అర్పణ్ రథం ఆధ్వర్యంలో బియ్యం, వక్క, శ్రీఫలం, దక్షిణ వసూలు చేశారు. ఇలా సేకరించిన సరుకు దుర్వినియోగం అవుతోందని ఆరోపించాయి. పచ్చి బియ్యం సేకరించి భక్తులకు పంపిణీ చేస్తున్న ఖిచిడి (పొంగలి) ప్రసాదం తయారీలో ఉప్పుడు బియ్యంతో కలిపి కల్తీ చేస్తున్నారని ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు స్పీకర్ పోడియం వైపునకు దూసుకుపోయి అర్పణ్ రథం బియ్యం అక్రమ వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిపై స్పీకర్ నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో బీజేపీ సభ్యులు ఆగ్రహంతో స్పీకర్ మైకుని విరగ్గొట్టారు.

పలుమార్లు వాయిదా

సభలో యుద్ధపూరిత పరిస్థితుల మధ్య సభా కార్యకలపాల నిర్వహణ అసాధ్యం కావడంతో స్పీకర్ పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. సభ సాయంత్రం 4 గంటలకు తిరిగి సమావేశమైంది. అయినా విపక్షాలు పట్టు వీడకుండా అర్పణ్ రథం సేకరించిన పచ్చి బియ్యంలో ఉప్పుడు బియ్యం కలపడం ఏమిటని ప్రభుత్వాన్ని చుట్టుముట్టే ప్రయత్నంలో చివరి వరకు రచ్చ కొనసాగించారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే నౌరీ నాయక్ స్పీకర్ పోడియంపైకి ఎక్కి మైక్రోఫోన్ పగలగొట్టినట్లు సమాచారం. దీంతో సభా కార్యక్రమాలను మరో గంట పాటు వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రమీలా మల్లిక్ ప్రకటించారు. మొత్తం మీద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

నయాగడ్ కేసుపై బీజేడీ పట్టు

ఇంతలో నయాగడ్ మైనర్ బాలిక హత్యకేసు విచారణ పూర్తయ్యి న్యాయస్థానం తుది తీర్పు వెల్లడించింది. ఈ తీర్పుతో హంతకుల తీరు తేటతెల్లం అయింది. దీంతో హంతకులకు అండగా నిలిచిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాష్ట్ర మహిళలకు క్షమాపణ కోరాల్సిందేనని అధికార పక్షం బిజూ జనతా దళ్ సభ్యుడు ప్రణబ్ ప్రకాష్ దాస్ పట్టుబట్టారు. ఈ వాదనతో సభలో వాతావరణం మరింత వేడెక్కింది. అధికార, విపక్షాల పోరు మధ్య సభా కార్యకలాపాల నిర్వహణకు వీలుకాని పరిస్థితులు చోటు చేసుకోవడంతో సభని మరో గంటపాటు వాయిదా వేసినట్లు ప్రకటించారు.

సభ బయట ప్రదర్శన

పచ్చి బియ్యంలో ఉప్పుడు బియ్యం కలిపి శ్రీజగన్నాథుని ప్రసాదం తయారీలో కల్తీకి పాల్పడడం అత్యంత విచారకరమని బీజేపీ సభ్యులు ఆరోపించారు. ఈ చర్యకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేననే నినాదంతో సభలో తీవ్ర గందరగోళం రేపిన సభ్యులు, చివరికి సభ బయటకు తరలి వచ్చి ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు.

కదం తొక్కిన ఉపాధ్యాయులు

- తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన



నిరసన ర్యాలీలో ఉపాధ్యాయులు



దిగువ పీఎంజీ ప్రాంతంలో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయులు దీర్ఘకాల డిమాండ్ల సాధనకు ఉద్యమం ఉధృతపరిచారు. వీరంతా బుధవారం స్థానిక దిగువ పీఎంజీ కూడలికి చేరుకుని భారీస్థాయిలో ఆందోళన చేపట్టారు. తమ 21 డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అందుకు నిరసనగా వీధికి ఎక్కాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయులు విచ్చేసి సామూహికంగా నిరసన ప్రదర్శించారు. ఒడిశా సెకండరీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఓస్టా) పిలుపు మేరకు స్థానిక దిగువ పీఎంజీ వద్ద రాష్ట్రవ్యాప్త ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈనెల 7వ తేదీలోగా ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళనకు దిగుతామని లోగడ ప్రభుత్వానికి ముందస్తుగా తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 4న రాష్ట్ర ప్రభుత్వంతో ఆందోళనకారుల వర్గం ఓస్టా ప్రతినిధులు ముఖాముఖి సమావేశమయ్యారు. తమ డిమాండ్ల సాధన కోసం పలుమార్లు ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులు మీడియాకు తెలిపారు. తమ సమస్యలపై ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్లే తాము ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. అర్హత ఉన్న పాఠశాలలకు గ్రాంట్లు, 226, 399 వర్గం పాఠశాలల ఉపాధ్యాయులకు జీతాల విధానం, రూ.2,800 గ్రేడ్ పేలో అవకతవకలు తొలగించడం, ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పొడిగించడం, అన్ ఎయిడెడ్ పాఠశాలల రిటైర్డ్ ఉపాధ్యాయులకు పింఛన్లు తదితర అంశాలు ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సులో సాహిత్యం, సృజనాత్మకత శీర్షిక కార్యక్రమంలో విద్యార్థులు సరికొత్త రికార్డు నెలకొల్పారు. కార్యక్రమంలో భాగంగా నా మాట – నా కథ (మో కొథ్హా మో కహానీ) శీర్షికలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాలుపంచుకున్నారు. ఈ శీర్షిక కింద విద్యార్థుల సృజనాత్మక కథనం అతి తక్కువ సమయంలో సోషల్ మీడియాలో ప్రపంచ రికార్డు సాధించింది. అతి తక్కువగా ఒక గంట వ్యవధిలో వ్యూస్ సాధించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు. దీంతో ఈ బృందంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యేకంగా ముచ్చటించారు. వీరందరికి ఆయన ప్రత్యేక బహుమానంతో అభినందించారు.

‘ప్రజలను దోచుకోవడానికే స్మార్ట్ మీటర్లు’



డీజీఎం కార్యాలయాన్ని ముట్టడించిన కాంగ్రెస్ నాయకులు

జయపురం: రాష్ట్ర ప్రజలను దోచుకోవడానికే ప్రస్తుతం ఉన్నటువంటి మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి నిహరంజన్ బిశాయిల నేతృత్వంలో వందలాది కాంగ్రెస్ కార్యకర్తలు స్థానిక టాటా పవర్ సప్లయ్ సౌత్–కో డిప్యూటీ మేనేజర్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. ఈ సందర్భంగా నరేంద్ర మహంతి మాట్లాడుతూ.. టాటా విద్యుత్ సరఫరా కంపెనీ స్మార్ట్ మీటర్లు వేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. అందువలన వెంటనే పాత మీటర్ల పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో తొలగించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై టాటా విద్యుత్ సరఫరా విభాగ డీజీఎం మన్మథనాథ్ మిశ్రో మాట్లాడుతూ ఒడిశాలో అన్ని ప్రాంతాల్లోనూ స్మార్ట మీటర్ల వ్యవస్థ ప్రారంభించారని, దీనిలో భాగంగానే జయపురంలోనూ ఆ వ్యవస్థ ప్రారంభించామని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డిమాండ్‌ను తాము ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నిహరంజన్ బిసాయి, కాంత పాడి, బలరాం పాణిగ్రాహి, కె.ఈశ్వరరావు, వెంకటరావు పట్నాయక్, బాలకృష్ణ పండ, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రవాణా సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

నరసన్నపేట: రహదారి భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చని రవాణా సహాయ కమిషనర్ ఏ.చంద్రశేఖరరెడ్డి అన్నారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా నరసన్నపేటలోని సెయింట్ క్లారెట్ స్కూల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణా చర్యలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం చేయకూడదన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, మైనర్లు వాహనాలు నడిపితే యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, ప్రిన్సిపాల్ బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్పయ్యదొర జయంతి

కాశీబుగ్గ: దివంగత మాజీ పార్లమెంట్ సభ్యుడు అప్పయ్యదొర 88వ జయంతి కార్యక్రమం గురువారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు హనుమంతు రామ్మోహనదొర ఒక ప్రకటనలో తెలిపారు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని దొర విగ్రహం వద్ద జరిగే కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు జిల్లా నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ బెండిగేటు వద్ద అప్పయ్యదొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారని, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గురు నిందితులు అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చైన్, సెల్‌ఫోన్



కృష్ణ నాయక్



సంజీవి సేనాపతి



ఎ.రాజా

జయపురం: ఒక యువకుడిపై దాడిచేసి అతడి వద్ద నున్న వస్తువులను దోచుకున్న ముగ్గురు నిందితులను జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి బుధవారం వెల్లడించారు. వారు దోచుకున్న ఒక బంగారు గొలుసు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. అరెస్టైనవారు స్థానిక సారవీధికి చెందిన కృష్ణ నాయిక్ (19), రెండో దైనిక బజారుకు చెందిన ఎ.రాజా(30), బలిపెట వీధికి చెందిన సంజీవి సేనాపతి(24)లుగా నిర్ధారించారు. వివరాల్లోకి వెళ్తే.. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బజారు వీధి ప్రశన్నజిత దాస్, ఒర్కెల్ వాసి తపన సాహు కలిసి జనవరి 14వ తేదీ మధ్యాహ్నం స్కూటీలో జయపురం వస్తున్నారు. వారు విజయవాడ – రాంచీ జాతీయ రహదారి జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి కొట్ట కూడలి వద్ద స్కూటీ ఆపి భోజనం చేశారు. ఆ సమయంలో కొంతమంది యువకులు బైక్‌పై అక్కడికి వచ్చారు. పెట్రోలు అయిపోవడంతో డబ్బులు కావాలని అడిగారు. అయితే వారు డబ్బు లేదని చెప్పడంతో కత్తి చూపించి భయపెట్టి పర్స్‌లో ఉన్నటువంటి రూ.4 వేలు దోచుకున్నారు. అంతేకాకుండా ప్రసన్న దాస్ వద్దనున్న మొబైల్, రెండున్నర తులాల బంగారు గొలుసుతో పాటు వారి వద్ద ఉన్న కాగితాలు ఇతర వస్తువులు దోచుకుపోయారని వెల్లడించారు. తపన సాహు వద్ద ఏమీ లేవని చెప్పడంతో కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. దీంతో తపన్ చేతికి పెద్ద గాయమైంది. ఆ సమయంలో ఆ మార్గంలో పలు వాహనాలు రావడం గమనించి దుండగులు పరారయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

గార: ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్ (పారా మిలటరీ) హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతిచెందిన గార మండలం రామచంద్రాపురం పంచాయతీ శిమ్మపేట గ్రామానికి చెందిన దుంగ రాంబాబు పార్థివ దేహానికి బుధవారం అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం కెరియా జిల్లాలోని శిక్షణా కేంద్రంలో సోమవారం ఉదయం రాంబాబు మృతి చెందగా, భౌతికకాయాన్ని ఐటీబీపీ ఆనందపురం



రాంబాబు పార్థివ దేహానికి వందనం సమర్పిస్తున్న ఐటీబీపీ బృందం

యూనిట్ బుధవారం ఉదయం స్వగ్రామం తీసుకువచ్చారు. రాంబాబు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటివద్ద సంప్రదాయ కార్యక్రమం ముగించగా.. ఐటీబీపీ బృందం ఆధ్వర్యంలో శ్మశానవాటికకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్లు దిలీప్‌కుమార్, రాకేష్‌శర్మ గౌరవవందనం చేశారు. గార ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి సెల్యూట్ చేశారు. అనంతరం బృంద సభ్యులు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అంత్యక్రియలు పూర్తయ్యాక జాతీయపతాకాన్ని హెచ్‌సీ రాంబాబు భార్యకు అధికారులు అందజేశారు.

వెంటాడిన మృత్యువు

వేర్వేరు ప్రమాదాల్లో జిల్లాకు చెందిన పలువురు మృత్యువాతపడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత
- విషాదంలో కుటుంబ సభ్యులు



మృతిచెందిన జగదీశ్వరి

రైలు కింద పడి బీఎస్ఎఫ్ జవాన్ మృతి




రాము(ఫైల్)

టెక్కలి రూరల్: దేశరక్షణలో సేవలందిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్‌ను మృత్యువు వెంటాడింది. కుటుంబ సభ్యులను చూసేందుకు వస్తుండగా జరిగిన రైలు ప్రమాదంలో జవాన్ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి మండలం గూడేం గ్రామానికి చెందిన పిట్ట రాము(36) పశ్చిమబెంగాల్ రాష్ట్రం రాయ్‌గంజ్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నారు. సెలవులపై ఇంటికి వచ్చేందుకు మంగళవారం రాత్రి కల్దా నుంచి పలాసకు రైలులో బయలుదేరాడు. మార్గమధ్యలో కోలకత్తా సమీపంలో రైలు కింద పడటంతో మృతిచెందాడు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా ఇంకేదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. మృతుడి భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో కలిసి టెక్కలి ఎన్టీఆర్ కాలనీ 6వ లైన్‌లో నివాసముంటోంది. మృతి వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. జవాన్ మృతదేహం గురువారం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు సమాచారం.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి మహిళ మృతి

టెక్కలి రూరల్: నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామానికి చెందిన గౌడు జగదీశ్వరి(30) అనే మహిళ ట్రాక్టర్ పైనుంచి పడి మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదీశ్వరి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల కోసం బుధవారం కాలినడకన బయలుదేరింది. మార్గమధ్యలో ట్రాక్టర్ ఎక్కి వెళ్తుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త దుర్యోధనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటైనర్ బోల్తాపడి వ్యక్తి దుర్మరణం



శ్రీనివాసరావు(ఫైల్)

జలుమూరు: మండలంలోని చల్లవానిపేట పంచాయతీ పంగవానిపేటకు చెందిన పంగ శ్రీనివాసరావు(46) మంగళవారం రాత్రి కర్నూలు జిల్లా గుత్తి జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం నుంచి హైదరాబాద్ వెళ్తున్న పశువుల కంటైనర్ గుత్తి టోల్ ప్లాజా వద్ద బోల్తా పడగా అక్కడే ఉన్న శ్రీనివాసరావుతోపాటు తునికి చెందిన మరో వ్యక్తి మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య శ్రీదేవి, కుమారుడు సుధీర్, కుమార్తె యమున ఉన్నారు. గుత్తి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఓటరు జాబితా నవీకరణ

పార్వతీపురం: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితా నవీకరణ చేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చేపట్టిన వివరాలను తెలియజేశారు. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిలుపుదల చేసేంతవరకు అప్‌డేట్ చేయనున్నట్లు చెప్పారు. ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలమాంబ మూడవ జాతర ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి మూడవ జాతరలో భక్తులు సమర్పించుకున్న కానుకలను ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. ఈ మేరకు శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.4,86,800, ప్రత్యేకదర్శనం ద్వారా రూ.1,17,780, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.13,040, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,75,680, పులిహోర ప్రసాదం ద్వారా రూ.1,01,160 ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. అలాగే అన్నదానం విరాళానికి భక్తులు రూ.91,495 అందించినట్లు తెలిపారు. హుండీలలో భక్తులు సమర్పించుకున్న కానుకలను నాలుగు, అయిదవ జాతరలో లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నెల్లిమర్ల: పట్టణ పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను నెల్లిమర్ల పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ పరిధిలోని పూడమ్మ తల్లి వనంగుడి సమీపంలో గల ఒక ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ అధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లిమర్ల పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.12,380 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామగణేష్ తెలిపారు.

85 లీటర్ల సారా పట్టివేత

పాలకొండ రూరల్: మండలంలోని ఓని గ్రామం మీదుగా పాలకొండ పట్టణంలోకి ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్న సవర కుమార్, ఎస్.సన్యాసిరావులను ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం గ్రామీణ రహదారుల్లో వాహన తనిఖీలు చేపడుతున్న క్రమంలో నిందితులు 85 లీటర్ల సారాతో పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఐదుగురి అరెస్టు

వేపాడ: మండలంలోని జాకేరు, పెదగుడిపాల గ్రామాల్లో వల్లంపూడి పోలీసులు బుధవారం నిర్వహించిన దాడుల్లో పది లీటర్ల సారాతో ఒకరు, కాయిన్ ఆటలో నలుగురు నిందితులు పట్టుబడ్డారు. పోలీసులకు అందించిన సమాచారం మేరకు జాకేరు గ్రామ సమీపంలో నిర్వహించిన దాడుల్లో కాయిన్ ఆట ఆడుతూ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారినుంచి రూ.57,400, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్‌లు, స్వాధీనం చేసుకుని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే పెదగుడిపాలలో నిర్వహించిన దాడుల్లో పదిలీటర్ల సారాతో వ్యక్తి పట్టుబడడంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

25కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: అక్రమంగా తరలిస్తున్న 25 కిలోల గంజాయిని బొడ్డవర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.కోట పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా కారులో నుంచి ఒక వ్యక్తి దిగి పరారయ్యాడు. అనంతరం విశాఖపట్నంలోని దొండపర్తికి చెందిన కారు డ్రైవర్ మజ్జి గణేష్‌ను, కారులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన నీలాక్షి సాధి అనే యువతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారును సీజ్ చేసి, పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరు పరిచి, పరారైన వ్యక్తి కోసం గాలింపు చేపట్టామని సీఐ వై.మురళీరావు, ఎస్సై సీహెచ్ గంగరాజులు వివరించారు.

జాబ్ మేళా రేపు

పార్వతీపురంటౌన్: ఈనెల 9న సుస్వదీప్ అగ్రో కంపెనీ పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్.వహిదా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న జాబ్‌మేళాకు హాజరయ్యేందుకు 10వ తరగతి నుంచి డిగ్రీ పాసైన అభ్యర్థులు వయస్సు 18-40 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచ్ ఇన్‌చార్జ్, గొడౌన్ ఇన్‌చార్జ్, డెలివరీ బోయ్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, కేవలం పురుష అభ్యర్థులకు మాత్రమే ఇంటర్వ్యూలు ఉంటాయని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సీఎస్. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

కడుపుకోతలే అధికం..!

- సిజేరియన్లకే ప్రాధాన్యం ఇస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- 9 నెలల్లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు 6,356
- సాధారణ ప్రసవాలు 3 వేలు మాత్రమే



ప్రైవేట్ ఆస్పత్రిలో సిజేరియన్‌చేస్తున్న వైద్యులు



ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో 60 నుంచి 70 శాతం సిజేరియన్ల ద్వారానే ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల కంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. కాసుల కోసం కార్పొరేట్ ఆస్పత్రులు సిజేరియన్లకు ప్రాధాన్యమిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రసవం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిన గర్భిణులు, వారి కుటుంబసభ్యులకు వారికి ఏదో ఒక సాకు చెప్పి సిజేరియన్ చేయడానికే వారిని ఒప్పించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. వైద్యుడు చెప్పినట్లు చేయకపోతే తల్లీబిడ్డకు ఏమవుతుందోనని భయపడి వారు చెప్పినట్లు గర్భిణుల బంధువులు తలాడిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో రెండువంతుల భాగం సిజేరియన్లే జరుగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు అధికంగా జరిగితే కార్పొరేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

57 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు

ప్రసవాలు జరిగే ప్రభుత్వ ఆస్పత్రులు జిల్లాలో 57 ఉన్నాయి. ప్రసవాలు జరిగే ప్రైవేట్ ఆస్పత్రులు 74 ఉన్నాయి. 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొత్తం ప్రసవాలు 7,067 జరిగాయి. అందులో సాధారణ ప్రసవాలు 3,877కాగా సిజేరియన్లు 3,190, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మొత్తం ప్రసవాలు 9,302 ప్రసవాలు జరగ్గా వాటిలో సిజేరియన్లు 6, 356, సాధారణ ప్రసవాలు కేవలం 3 వేలు మాత్రమే.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు సాధారణ ప్రసవాలు చేయడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అత్యవసరమైతే తప్ప సిజేరియన్ చేయడం లేదు.

సిజేరియన్ వల్ల నష్టం

ఒకసారి సిజేరియన్ చేస్తే రెండోసారి కూడా సిజేరియన్ చేయాలి. దీని వల్ల మహిళలు నడుంనొప్పి, కాళ్ల నొప్పులు వంటి సమస్యల బారిన పడతారు. అదేవిధంగా సాధారణ ప్రసవమైతే రక్తస్రావం తక్కువగా జరుగుతుంది. సిజేరియన్ అయితే రక్తస్రావం అధికంగా జరుతుంది. దీనివల్ల మహిళలు రక్తహీనత బారిన పడే ఆస్కారం ఉంది.

2022-23, 2023-24 సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల వివరాలు

సంవత్సరం	మొత్తం ప్రసవాలు	సిజేరియన్లు	సాధారణం
ప్రభుత్వ ఆస్పత్రుల్లో..			
2022-23	9,678	3918	5,780
2023-24	7067	3,190	3,877
ప్రైవేట్ ఆస్పత్రుల్లో..			
2022-23	16,749	12,600	4,149
2023-24	9302	6356	3000

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలు చేయడానికే వైద్యులు ప్రాధాన్యం ఇవ్వాలి. సిజేరియన్ అత్యవసరం అనుకుంటేనే చేయాలి. ఎవరైనా మహిళలు సిజేరియన్ చేయాలని పట్టుబడితే వారికి సిజేరియన్ వల్ల కలిగే అనర్థాల గురించి వివరించాలి.

దాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

- నులిపురుగులతో పిల్లల్లో అనారోగ్య సమస్యలు
- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఈనెల 9వ తేదీన జిల్లాలోని 19 ఏళ్లలోపు వయస్సు గల బాలబాలికలందరికీ అల్బెండజోల్ మాత్రలు ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 3.58 లక్షల మంది బాలబాలికలకు 9వతేదీన భోజనం అనంతరం నులిపురుగుల నివారణ మాత్రలు వేయించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు, పిల్లలకు ఆ రోజున మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు తప్పనిసరిగా మింగించి అనారోగ్య సమస్యల నుంచి వారికి విముక్తి కలిగించాలని కోరారు.

పాఠశాలల్లో మాత్రల పంపిణీ

జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అక్కడే మాత్రలు ఇస్తారని, పాఠశాల బయట ఉండే బాలబాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందిస్తామని తెలిపారు. జిల్లాలోని అని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కూడా అల్బెండజోల్ మాత్రలు ఆయా పాఠశాలల యాజమాన్యాల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. జాతీయ, నులిపురుగుల దినం రోజున మాత్రలు వేయించలేని వారికి 16వతేదీన వేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 1నుంచి 2 సంవత్సరాల బాలబాలికలకు అరమాత్రను గుండ చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. 6 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు 400 మిల్లీగ్రాముల పూర్తి మాత్రను ఇవ్వనున్నామన్నారు. జిల్లాలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయల ద్వారా ఆయా పాఠశాలలకు అవసరమైన మాత్రల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ రవికుమార్, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

కొత్తవలస: అరకు-విశాఖ జాతీయ రహదారిలో చింతలపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం ఓ బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి 202 కాలనీకి చెందిన పిన్నింటి లక్ష్మి(45) మృతి చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి సమీపంలో భవన నిర్మాణ కూలీగా లక్ష్మి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకొంటోంది. అయితే బుధవారం ఉదయం తోటి కూలీకి చెందిన ద్విచక్రవాహనంపై ఆమె పెందుర్తి వెళ్తుండగా ఎస్.కోట నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై తుళ్లిపడిపోయారు. బైక్ నడిపే వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడినప్పటికీ లక్ష్మి రోడ్డు మధ్యలో పడిపోవడంతో బస్సు వెనుక చక్రాలు ఆమె తలపైనుంచి వెళ్లిపోయాయి. దీంతో ఆమె తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాద వార్త తెలుసుకున్న సీఐ వి.చంద్రశేఖర్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి మృతురాలి భర్త సన్యాసిరావు ఫిర్యాదు మేరకు శవ పంచనామ నిర్వహించి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రక్తహీనత రహిత జిల్లాయే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: రక్త హీనత రహిత జిల్లాగా పార్వతీపురంమన్యం ఆవిర్భవించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆకాంక్షించారు. జిల్లాలో ప్రిజమ్-10 (ప్రాజెక్టు ఫర్ రెడ్యూసన్ ఆఫ్ ఇన్‌ఫాంట్ మోర్టాలిటీ-10) ప్రాజెక్టు అమలు, అభిలాష తదితర అంశాలపై మండల అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం సమీక్షించారు. రక్తహీనతపై గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికలకు అవగాహన కల్పించేందుకు, అవసరమైన మందులు, పౌష్టికాహారం అందజేసేందుకు గ్రామ, వార్డు స్థాయిలో ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీస్‌తో కూడిన బృందం ఏర్పాటుచేశామన్నారు. హైరిస్క్ కేసులు తగ్గించడంలో ఈ బృందం తీరును ప్రశంసించారు. మాతృశిశు మరణాలు నియంత్రణే ధ్యేయంగా ప్రిజమ్‌ను జిల్లాలో ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పాచిపెంటలో బృందం తీరు బాగుందన్నారు. టేక్ హోమ్ రేషన్‌ను గర్భిణులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇమ్యూనైజేషన్ శతశాతం జరగాలని స్పష్టం చేశారు. కిల్కారి వాయిస్ కాల్‌ను ఉపయోగించుకోవాలని ఆయన చెప్పారు. ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలన్నారు.

నిరుద్యోగులకు మేలుచేసే 'అభిలాష'

నిరుద్యోగులకు మేలుచేసేలా 'అభిలాష' గ్రంథాలయాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే 66 రకాల పుస్తకాలను రెండు సెట్లు చొప్పున అందుబాటులో ఉంచామన్నారు. సివిల్స్, గ్రూప్-1, 2, యూపీఎస్సీ, ఎస్‌సీఆర్‌టీ, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఇవి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నారాయణరావు, ప్రిజమ్ నోడల్ అధికారి డా.ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

11న వెటరన్ బ్యాడ్మింటన్ టోర్నీ

శృంగవరపుకోట: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న విజయనగరం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి వెటరన్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు డీబీఏ సలహాదారు డాక్టర్ పి.శ్రీరాములు తెలిపారు. అండర్- 35, 40, 45, 50, 60, 65, 70 వయస్సు గల మహిళలు, పురుషుల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి విభాగంలో కనీసం 6 టీములు ఉంటేనే పోటీలు నిర్వహిస్తారని, లేకుంటే ఎంపిక పోటీలు మాత్రమే నిర్వహిస్తామన్నారు. ఎంట్రీ ఫీజుగా సింగిల్స్‌కు రూ.500 లు, డబుల్స్‌కు రూ.1000లు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని, విజేతలకు సర్టిఫికెట్స్, షీల్డ్స్ ఇస్తారన్నారు. సింగిల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారిని, డబుల్స్‌లో ప్రథమ స్థానం సాధించిన వారు ఈనెల 16వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు తమ వయస్సు నిర్ధారణ పత్రం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. డీబీఏ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, సహాధ్యక్షుడు వి.ఎస్.ప్రసాద్, ఎం.కె.బి.శ్రీను, కార్యదర్శి కుసుమబచ్చన్‌ల ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కె.అపర్ణబాబా- బొబ్బిలి (79811 11705), బహదూర్ తాపా- సాలూరు (94945 94356), నున్నా సురేష్-విజయనగరం (94405 855 53), వై.గణేష్ - కొత్తవలస (90329 19065), ఎస్.కోట-పి.శ్రీరాములు (94902 65104)కు ప్రవేశ రుసుం చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అందుబాటులో అత్యవసర సేవలు

- ఆయుష్షు పోస్తున్న 108 వాహనాలు
- వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- రోగులకు మెరుగైన వైద్యసేవలు

పార్వతీపురం టౌన్:

ఆపద సమయాన ఆదుకునేందుకు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 108, 104 సేవలను అందుబాటులోకి తెచ్చారు. వాటిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. ఆధునిక వైద్యపరికరాలతో కూడిన కొత్తవాహనాలను సమకూర్చింది. వైద్య పరీక్షలు, సేవల సంఖ్యను పెంచింది. మరోవైపు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వీలుగా నియోనేటల్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చింది. ప్రజారోగ్యమే పరమావధిగా సేవలందిస్తోంది. దీని కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటోంది. మరోవైపు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందేలా నాడు-నేడు నిధులతో ఆధునిక సొబగులు అద్దింది. వైద్యులు, సిబ్బంది నియామకాలతో పాటు ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింది రూ.25లక్షల వరకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందిస్తోంది. చికిత్స అనంతరం ఆసరా కింద భృతిని చెల్లిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పల్లె ముంగిటనే వైద్యసేవలు అందిస్తోంది. జిల్లా ప్రజలకు ప్రస్తుతం 108 అంబులెన్స్‌లు 18, 104 అంబులెన్స్‌లు 29, తల్లీ, బిడ్డ వాహనాలు-16 సేవలందిస్తున్నాయి.


108లో సకల సౌకర్యాలు

108 అంబులెన్స్‌లో రెండు ఆక్సిజన్ సిలండర్లతో కూడిన సిస్టం ఉంటుంది. మల్టీ పారామీటర్ (బీపీ, పల్స్, ఆక్సిజన్ శాతం తెలుసుకొనేందుకు) ఉపయోగపడుతుంది. సుగర్ పరీక్ష చేసేందుకు గ్లూకోమీటర్, సిరంజ్ పంపు(మందు ఎంత మోతాదులో ఇవ్వాలో తెలియజేసేది, స్ట్రెక్చర్, వీల్‌చైర్, బీపీ ఆపరేటర్, వాల్యూమ్ ఇన్‌ఫ్యూజన్ పంపు, మందులు వంటి సౌకర్యాలు అంబులెన్స్‌లో ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా 18 అంబులెన్స్‌లు ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా 30,136 సేవలందించాయి.

పల్లెల ఆరోగ్య నాడి 104లు

104 వాహన సేవలు పల్లె ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నాయి. ప్రతీనెల వాహన వైద్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ విధానం కింద ఒక్కో గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. నెలకు సరిపడా మందులను అందజేస్తూ దీర్ఘకాలిక రోగుల ఆయుష్షును పెంచుతున్నారు. కొందరిలో తొలిదశలోనే వ్యాధులను గుర్తించి మెరుగైన వైద్యసేవల నిమిత్తం సిఫార్సు చేస్తున్నారు. జిల్లాలో 15 మండలాల్లో 104 వాహనాలు 29 ఉన్నాయి. వీటి ద్వారా సంవత్సర కాలంలో 7,44,976 మందికి వైద్య సేవలు అందించారు.

తల్లీబిడ్డల సేవకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్



తల్లీబిడ్డ వాహనాలు

ప్రసవానంతరం తల్లీబిడ్డలను ఆస్పత్రి నుంచి ఇళ్లకు క్షేమంగా చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్(102) సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాకు 16 వాహనాలు కేటాయించింది. ఈ సర్వీసుల ద్వారా ఏడాదిలో 7,457 మందికి సేవలందించింది. పైసా ఖర్చులేకుండా తల్లీబిడ్డలను ఇళ్లకు చేర్చుతోంది.



పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో సేవలందిస్తున్న 104 వాహనాలు

జిల్లాలో అత్యవసర వాహన సేవలు ఇలా...

వాహనం	సంఖ్య	అందించిన సేవలు
108 అంబులెన్సులు	18	30,136
104 అంబులెన్స్‌లు	29	7,44,976
102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు	16	7,457
నియోనేటల్	2	1589

క్షేమంగా గమ్యం చేర్చడమే లక్ష్యం



రోగులను, రోడ్డు ప్రమాద బాధితులను తక్షణమే ఆస్పత్రికి చేర్చడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నాం. 108 వాహనాల్లో అన్ని వైద్యసదుపాయాలూ ఉన్నాయి. అంబులెన్స్‌లన్నీ పూర్తి ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయి. సకాలంలో సేవలు అందిస్తుండడంతో ప్రజల మన్ననలు అందుతున్నాయి.

– ఎస్.మన్మథరావు, 108 వాహనాల జిల్లా మేనేజర్

ముందస్తుగా సమాచారం



గ్రామానికి 104 వస్తుందని ఒక రోజు ముందుగానే వలంటీర్లతో ఇంటి వద్దకు సమాచారం చేరవేస్తున్నాం. ఈ అంబులెన్స్‌లు ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. నడవలేని వృద్ధుల ఇళ్లవద్దకు సిబ్బందిని పంపించి వైద్యం, మందులు ఉచితంగా అందజేస్తున్నాం. ప్రతి గ్రామానికి నెలకు రెండు సార్లు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నాం.అవసరమైన మందులు అందజేసి ఆయుష్షు పెంచుతున్నాం.

– పూసర్ల ప్రసాద్, 104, 102 సర్వీసుల జిల్లా మేనేజర్

శిశువుల సంరక్షణకు నియోనేటల్



నియోనేటల్ అడ్వాన్స్ లైఫ్ సపోర్టు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఏటా 250కు పైగా శిశు మరణాలు నమోదయ్యేవి. శిశుమరణాలను తగ్గించి వారికి దీర్ఘాయుష్షను ప్రసాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అధునాతన పరికరాలతో కూడిన నియోనేటల్ అడ్వాన్స్ లైఫ్ సపోర్టు 108 వాహనాలను జిల్లాకు రెండు మంజూరు చేసింది. ఈ వాహనం ద్వారా నవజాత శిశువుల వైద్యానికి కుటుంబ సభ్యులు కోరిన మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రులకు పంపించేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో సంవత్సర కాలంలో పార్వతీపురం డివిజన్‌లో 800, పాలకొండ డివిజన్ పరిధిలో 789 నవజాత శిశువులకు సేవలందించింది.

కలకలం రేపిన కిడ్నాప్ ఉదంతం

విజయనగరం క్రైమ్: స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 6న మధ్యాహ్నం జరిగిన ఓ వ్యక్తి కిడ్నాప్ ఉదంతం కలకలం రేపింది. ఎట్టకేలకు బాధితుడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. బాబామెట్టలో సింహాద్రి వాటర్ ప్లాంట్ నడుపుతున్న శివకిశోర్ మంగళవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో వాటర్ క్యాన్‌లను వెహికల్‌లో లోడ్ చేసి ట్రాన్స్‌పోర్టు చేసేందుకు ప్లాంట్ నుంచి బయల్దేరాడు. కొద్దిదూరం ప్రయాణించాక ఇద్దరు వ్యక్తులు ఆ వాహనానికి అడ్డంగా పడ్డారు. దీంతో శివకిశోర్ వెంటనే వాహనాన్ని ఆపి దిగి వారికి మంచినీరు తాగించాడు. ఇది జరుగుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కొంతమంది వచ్చి శివకిశోర్‌పై పిడిగుద్దులు కురిపించి, కారులో ఎక్కించుకుని పూసపాటిరేగ వరకూ తీసుకువెళ్లి డబ్బులు, ఆభరణాలు దోచుకుని కొన్ని లక్షల రూపాయల అగ్రిమెంట్ పత్రాలపై సంతకాలు చేయించుకుని అక్కడ విడిచిపెట్టి కారులో పరారయ్యారు. బాధితుడు వియనగరం చేరుకుని టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. సతీష్‌కుమార్ అనే వ్యక్తితో తనకు విభేదాలున్నాయని, అతనే ఈ పని చేయించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని టూటౌన్ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

మాయమాటలతో వ్యక్తిగత వివరాల సేకరణ

- టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల ఫిర్యాదు



రూరల్ ఎస్సై వెంకటరమణకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు:

పథకాలు వస్తాయంటూ మాయమాటలు చెప్పి ప్రజల నుంచి వ్యక్తిగత ,కుటుంబ వివరాలను నమోదుచేసుకుంటున్న టీడీపీ నాయకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సాలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటరమణకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఫిర్యాదులో వారు పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. కొంతమంది వ్యక్తులు ప్రజల వద్దకు వెళ్లి, తాము టీడీపీ నాయకులమని చెబుతూ, తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, బాబు ష్యూరిటీ -భవిష్యత్‌కు గ్యారంటీ కింద పథకాలు మంజూరు చేస్తామని చెబుతున్నారు. ఈ క్రమంలో, ఈ పథకాలన్నీ రావాలంటే ఇప్పుడే మీ ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటే, ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు పడతాయని నమ్మించి మోసపూరితమైన మాటలతో ప్రజల వ్యక్తిగత,కుటుంబ వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. అమాయక గిరిజనులు, దళితులు, బీసీలే లక్ష్యంగా టీడీపీ నాయకులు ఈ వివరాలు సేకరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మండలంలోని పెదపధం పంచాయతీలో ఈ విధంగా జరిగిందని ఉదహరించారు. ప్రజల వ్యక్తిగత వివరాలు టీడీపీ నాయకులు తెలుసుకోవడం వల్ల ప్రజలకు నష్టం చేకూరే ప్రమాదం ఉందని, ఓట్లు తొలగించవచ్చని వివరించారు. కావున పై విషయాలపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.